పరామర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

మృతుల కుటుంబాలకు పరామర్శ

తొర్రూరు, ఫిబ్రవరి 12 : అమ్మాపురం గ్రామంలో ఈతకు వెళ్లి కాల్వ నీటిలో పడి మృతి చెందిన చిన్నారులు గంధం యాకూబ్, కిన్నెర జంపన్న మృతదేహాల వద్ద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న మంత్రి సోమవారం అమ్మాపురం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం కొంత ఆర్థికసాయం అందజేశారు. సరదాగా ఈతకు వెళ్లి మృతిచెందడం బాధాకరమని, రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొందన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. దయాకర్‌రావు వెంట ఎంపీపీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాకయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ముద్దం వీరారెడ్డి ఉన్నారు.

చిన్నారుల కుటుంబాలను ఆదుకుంటాం..

చిన్నారుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె తొర్రూరు మార్చురీ వద్ద చిన్నారుల మృత దేహాలను పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు పిల్లల కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆమె వెంట టీపీసీసీ మాజీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ విక్రమ్‌రెడ్డి, కాంగ్రెస్ తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్ ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : జీసీడీవో

నర్సింహులపేట, ఫిబ్రవరి 12 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో విజయకుమారి సూచించారు. సోమవారం మండలంలోని కేజీబీవీని జీసీడీవో, సాయికృష్ణ విద్యా నిలయాన్ని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సంతోష్, చంద్రశేఖర్‌అజాద్ పరిశీలించారు. గుర్తింపు పత్రాలు, రిజిస్టర్లు, యూడైస్ ప్లాన్ ఆన్‌లైన్‌ను పరిశీలించారు. సీఆర్పీలు శేషుకుమార్, వీరన్న, నాగేశ్వర్‌రావు, నరహరి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో విజయకుమారి

నూతన ఎంపీపీగా బట్టు నాగరాజు

గార్ల ఫిబ్రవరి 12 : నూతన ఎంపీపీగా బట్టు నాగరాజును ఎన్నికయ్యారు. గత నెల ఎంపీటీసీలంతా కలిసి ఎంపీపీ శివాజీపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీంతో ఎంపీపీ శివాజీ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో పదవి ఖాళీ అవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నూతన ఎంపీపీని ఎన్నుకున్నారు. మండలంలో మొత్తం 11మంది ఎంపీటీసీలకు గాను 9 మంది సోమవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. వీరిలో 8 మంది మాత్రమే ఎన్నికలో పాల్గొన్నారు. సిరిపురం ఎంపీటీసీని బట్టు నాగరాజును ఎంపీపీగా ఎన్నుకున్నారు. చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక జరుగగా, ఏడుగురు కాంగ్రెస్ ఎంపీటీసీలు, సీపీఐ నుంచి ఒకరు మద్దతు తెలుపడంతో నాగరాజును ఏకగ్రీవ ఎంపీపీగా ఆర్డీవో అలివేలు ప్రకటించారు. ఎంపీపీకి ఎమ్మెల్యే కోరం కనకయ్య, పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్ అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యలపై లోకల్ కోర్టు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 12: మండల కేంద్రం సమీపంలోని సబ్‌స్టేషన్ ఉపకేంద్రంలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహిస్తామని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ తిరుమల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ సమస్య, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, నూతన సర్వీస్‌లు మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, కేటగిరిల మార్పు, సర్వీస్ రద్దు మొదలగు సమస్యలపై వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

ఆలయ భూమిని కాపాడాలి

కేసముద్రం, ఫిబ్రవరి 12: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో ఉన్న దేవాలయ భూమిని కాపాడాలని సీపీఎం నాయకుడు గొడిశాల వెంకన్న అధికారులను కోరారు. దేవాలయ భూములను రక్షించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన వినతిపత్రం అందజేశారు. వెంకన్న మాట్లాడుతూ.. సర్వే నంబర్ 384లో 4ఎకరాల 9 గుంటల భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకొని కంచె వేశాడని, అధికారులు విచారణ జరపాలని పేర్కొన్నారు.

పలు రైలు సర్వీస్‌ల పునరుద్ధరణ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: అదనపు మూడో రైల్వే లైన్ ఆధునీకరణలో భాగంగా కొన్ని రైళ్లను రైల్వే అధికారు లు రద్దు చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించాల ని ఎంపీ మాలోత్ కవిత పలుమార్లు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పం దించిన రైల్వే అధికారులు రైళ్లను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాజీపేట–డోర్నకల్, డోర్నకల్–విజయవాడ, విజయవాడ– భద్రాచలం జంక్షన్లలో రైళ్లను పునరుద్ధరిస్తున్న అధికారులు తెలిపారు. నెక్కొండ, కేసముద్రం, మానుకోట, గార్ల, డోర్నకల్ మీదుగా భద్రాచలం ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

25 వరకు రైళ్ల పొడగింపు

డోర్నకల్: కాజీపేట నుంచి విజయవాడకు పుష్‌పుల్, భద్రాచలం– విజయవాడ వరకు ప్యాసింజర్ రైళ్లను 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పొడగించినట్లు రైల్వే ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌సీసీ మాజీ సభ్యుడు మైనుపాషా రైల్వే పీసీవో ఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

డోర్నకల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు

సమ్మెను జయప్రదం చేయాలి

గార్ల, ఫిబ్రవరి 12 : ఈ నెల 16న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామన్న బీజేపీ ప్రభుత్వం, వ్యవసాయ పంటలకు ధరలు లేకుండా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అప్పిరెడ్డి, భూక్యా హరి, మౌలానా, శ్రీను, నాగరాజు, మల్లయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నర్సింహులపేట: దేశవ్యాప్తంగా 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని దాసుతండాలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాలతో ప్రజల జీవన ఆదాయం గణనీయంగా పడిపోయి పేదల సంఖ్య పెరిగిందన్నారు. దేశంలో 80కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన మగ్గుతున్నారని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ స్కీం అమలు చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు చిర్ర యాకన్న, కమలాకర్, సుక్య, లాల్‌సింగ్, శ్రీనివాస్, లక్‌పతి, భిక్షం, వెంకన్న, బాలు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో బైక్ ర్యాలీ

డోర్నకల్: బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం డోర్నకల్ పట్టణంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. డోర్నకల్ మెయిన్ రోడ్, సెకండ్ మెయిన్ రోడ్, సుభాష్ స్ట్రీట్, ఇందిరానగర్, రైల్వే కాలనీ మీదుగా రైల్వేస్టేషన్ ఆవరణ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నుంచి మండల ప్రధాన కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా నాయకులు అశోక్‌కుమార్, మండల కార్యదర్శి దాసరి మల్లేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, సీపీఐ (ఎంఎల్)నుంచి యాస వెంకటనారాయణ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండ సభకు భారీగా తరలిరావాలి

పెద్దవంగర, ఫిబ్రవరి 12 : 'నల్లగొండ' సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనను పరామర్శించి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రానికి ఉండే హక్కులను కాపాడుకున్నామని, కేవలం రెండు నెలల వ్యవధిలోనే పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించారని మండిపడ్డారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేదని ఎద్దేవా చేశారు. నల్లగొండలో నిర్వహించే సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సోమేశ్వర్‌రావు, నాయకులు మల్లికార్జునాచారి, సోమన్ననాయక్, ముజీబుద్దీన్, రాము, భిక్షపతి, బాలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

సొంత ఖర్చుతో గుంతలు పూడ్చి..

నర్సింహులపేట, ఫిబ్రవరి 12: వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాదారులు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం ఏదోచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సోమవారం మాజీ ఉప సర్పంచ్ కొమ్ము అనిల్ తన సొంత ఖర్చుతో సిమెంట్ వేసి గుంతలు పూడ్చివేయించారు. వాహదారులు, స్థానికులు అనిల్‌ను అభినందించారు.

రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి వేస్తున్న అనిల్

సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం చంద్రశేఖర్

మహిళా సాధికారతే లక్ష్యం

నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, కేవీకే కో ఆర్డినేటర్ మాలతి

పెద్దవంగర, ఫిబ్రవరి 12 : మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నట్లు నాబార్డు ఏజీఎం ఎల్ చంద్రశేఖర్, కేవీకే కో ఆర్డినేటర్ మాలతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉప్పరగూడెం, చిన్నవంగర, పెద్దవంగర గ్రామాల మహిళా స్వయం సహాయక సంఘాలకు 'లక్ష్యం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ప్రాసెసింగ్, మిల్లెట్స్ శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో లత, చైర్మన్ శంకర్, ఏఈవో యశస్విని, సీడీపీవో హైమావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 12 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను యూ డైస్‌లో నమోదు చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి చంద్రశేఖర్ అజాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. సీడబ్ల్యూఎస్‌ఎన్ విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో సంతోష్, మహేశ్, రామకృష్ణ, మురళీమోహన్, కవిత, షారున్ పాల్గొన్నారు.

తొర్రూరు సీఐగా సంజీవ్

తొర్రూరు, ఫిబ్రవరి 12 : తొర్రూరు పోలీస్ సర్కిల్ నూతన సీఐగా టీ సంజీవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా డీసీఆర్బీలో విధులు నిర్వర్తిస్తూ తొర్రూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ సత్యనారాయణ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తొర్రూరు, ఫిబ్రవరి 12 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీ వద్ద సోమవారం జరిగింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన షేక్ యాకూబ్ అలీ(57) తన బైక్‌కు తొర్రూరులోని టీవీఎస్ షోరూంలో మరమ్మతులు చేయించాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి రాగా, వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి కొడుకు యాసిన్‌పాషా ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుర్గమ్మ ఆశీస్సులతో అభివృద్ధికి సహకరిస్తాం

తొర్రూరు, ఫిబ్రవరి 12 : దుర్గామాత ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కర్కాల గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు సంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, సీనియర్ నాయకులు సోమయ్య, విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న ఝాన్సీరెడ్డి

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని సూర్య శోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు తేజావత్ మౌర్య, ప్రసన్న గోల్డ్ మెడల్, సింధు, దీపిక బ్రౌన్ బెల్ట్‌లో గోల్డ్ మెడల్, రేవంత్ ఎల్లో బెల్ట్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీనియర్ కరాటే మాస్టర్ పాయం సురేశ్, అకాడమీ చీఫ్ వీరూనాయక్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు.

ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

బయ్యారం సొసైటీలో అక్రమాలపై విచారణ చేపట్టాలి

బయ్యారం, ఫిబ్రవరి12: బయ్యారం సహకార పరపతి సంఘంలో జరిగిన అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టాలని సొసైటీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, డైరెక్టర్లు మల్లయ్య, శ్రీనివాస్, కేతమల్లు, సీతారాంరెడ్డి, యశోద కోరారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి నాలుగు సంవత్సరాల నుంచి పాలకవర్గం సభ్యులను మభ్యపెడుతూ రైతులకు చెందాల్సిన సబ్సిడీ డబ్బులను సొంతానికి వాడుకొని అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. రూ.54లక్షల అవినీతి విషయంలో అందిన నోటీసులపై వారం రోజుల క్రితం డీసీవో, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించి న్యాయ విచారణ జరిపించాలని కోరారు. చర్యలు తీసుకోని పక్షంలో రైతులతో కలిసి సొసైటీ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందిని మార్చడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, భద్రత కల్పించాలన్నారు. మల్లేశ్, భాస్కర్‌రెడ్డి, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు కనీస సౌకర్యాలను కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 12 : ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని 'మెపా' (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కోరారు. సోమవారం పట్టణంలో మెపా ఆధ్వర్యంలో ముదిరాజ్ సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్య, ఉద్యోగ అవకాశాల్లో ముదిరాజ్ కులస్తులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నీరటి రాజు, చిరంజీవి, రమణ, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం మండల కమిటీ ఎన్నిక

భద్రయ్య

మహేశ్

కురవి, ఫిబ్రవరి 12 : రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం(టీఆర్‌వీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరి మదార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కురవిలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మామిడాల భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా పూసపాటి మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మదార్ మాట్లాడుతూ.. బీసీ రుణాల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై, రజక ఫెడరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. 50 ఏండ్లు నిండిన ప్రతి రజకుడికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్ మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులందరూ సమస్యలపై ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుగ్గి లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం సారయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వరిపెల్లి పూర్ణ, జిల్లా సహాయ కారదర్శి పొడగంటి శేఖర్, మండల నాయకులు అక్కెనపల్లి లింగన్న, పోచారం వెంకన్న, నరేశ్, వీరంపల్లి పృథ్వీరాజ్, అక్కెనపల్లి మధు, పోచారం దాస్, కందగట్ల శివ, అక్కనపెల్లి కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ నాగరాజు

తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతలు

నర్సింహులపేట, ఫిబ్రవరి 12 : మండల తహసీల్దార్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వివేక్ బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లాడు. కొత్తగూడెం జిల్లా పాల్వంచ తహసీల్దార్‌గా పనిచేసిన నాగరాజు బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

సీరోలు తహసీల్దార్‌గా శారద

కురవి(సీరోలు) : సీరోలు మండల తహసీల్దార్‌గా శారద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆమె కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బయ్యారం తహసీల్దార్‌గా..

బయ్యారం: మండల తహసీల్దార్‌గా సాధియాసుల్తానా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఇమ్మానుయెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్లగా, అదే జిల్లా చంద్రుగొండ మండలం నుంచి ఆమె బదిలీపై వచ్చారు.

కిడ్నాప్ కలకలం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి12: మహబూబాబాద్ పట్టణంలో కిడ్నాప్ కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం వ్యవసాయ మార్కెట్ సెంటర్ వద్ద ఓ మహిళ తన పిల్లలతో కలిసి బస్సు కోసం ఎదురుచూస్తున్నది. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి పిల్లల వద్దకు వచ్చి అమ్మాయిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. పక్కన ఉన్నవారు గమనించి తల్లిని అలర్ట్ చేయడంతో ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు సదరు వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు. టౌన్ ఎస్సై పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. అతను బీహార్‌కు చెందిన వ్యక్తిని, ఓ ఇంట్లో పని చేయటానికి వచ్చాడని తెలిపారు. బస్సు వద్ద ఉన్న అమ్మాయి తన పాపలా ఉందని దగ్గరకు వెళ్లడంతో వారు భయపడి అరిచారని చెప్పాడు.

ఇఫ్కో కంపెనీ పేరుతో ఆన్‌లైన్ మోసం

- ఫర్టిలైజర్ షాపు పెట్టుకోవడానికి రూ.5 లక్షలిస్తుందని చెప్పి..
- రూ. 4.20 లక్షలు కాజేసిన మోసగాడు
- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

నెల్లికుదురు, ఫిబ్రవరి 12 : ఫర్టిలైజర్ షాపు పెట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇఫ్కో కంపెనీ ఇస్తుందని వచ్చిన ఫోన్ కాల్‌తో రూ.4.20 లక్షలు పోగొట్టుకున్న ఘటన మండలంలోని నైనాల గ్రామంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి శోభన్‌బాబుకు 'ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన కేంద్రం నుంచి మాట్లాడుతున్నా. ఫర్టిలైజర్ షాపు పెట్టుకోవడానికి ఇఫ్కో కంపెనీ రూ.5 లక్షలు ఇస్తుంది'ని డిసెంబర్ 12, 2023న ఫోన్ కాల్ వచ్చింది. నమ్మిన శోభన్‌బాబు ప్రాసెస్ ఏంటని సంప్రదించగా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.10,500 ఉంటుందని చెప్పాడు. మిమ్ముల్ని నమ్మడమెలా అని అడగగా, అతడి ఆధార్, ఐడీ కార్డును పంపించాడు. అందులో ఆ వ్యక్తి పేరు మాల దివాకర్, తండ్రి తిమ్మరాజులు, పాత గుంతకల్లు మస్తానయ్య వీధి, అనంతపూర్ జిల్లా అని ఉన్నది. అతడి మాటలు నమ్మి మొదట రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 10,500 అకౌంట్ నంబర్‌కు పంపించాడు. సబ్సిడీ కోసం రూ.50 వేలు, కెమికల్ లైసెన్స్ కోసమని రూ. 87,708, స్టేట్ అప్రూవల్‌కని రూ. 31,708, ఇన్సూరెన్స్‌కు రూ. 87,402 పంపించమనగా, మొత్తం రూ. 4.20 లక్షలు పంపాడు. తర్వాత అతడికి ఫోన్ చేస్తే స్పందించలేదు. ఫర్టిలైజర్ షాపు పెట్టుకోవడానికి సబ్సిడీ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేసి డబ్బులు కాజేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తన డబ్బులు ఇప్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్ శోభన్‌బాబు సోమవారం ఫిర్యాదు చేశాడు.

డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న విజయేందర్

నెల్లికుదురు, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ మహబూబాబాద్ జిల్లా చైర్మన్ పంతం విజయేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన నిరుద్యోగ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులు అవస్థలు పడుతున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని మెగా డీఎస్సీకి త్వరగా నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్యామ్, మండల నాయకులు శ్రీను, ఉపేందర్, వెంకట్, ప్రవీణ్, వెంకన్న పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తాం..

పీఏసీఎస్ మాజీ చైర్మన్ రావుల రాంరెడ్డి

చిన్నగూడూరు, ఫిబ్రవరి12 : గ్రామంలో నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేస్తామని పీఏసీఎస్ మాజీ చైర్మన్ రావుల రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్వగృహంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ ఆదేశానుసారం నిజమైన పేదలను గుర్తించి ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నగేశ్, నాయకులు ఆదాం, జీవన్, శ్రీను, అబ్దుల్ బాసిత్, రవి, శేఖర్, ఉప్పలయ్య, రఫీ పాల్గొన్నారు.

15న 'చలో గాంధీభవన్'

కొత్తగూడ, ఫిబ్రవరి 12: రాష్ట్రంలోని ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంట్ స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని కుమ్రంభీమ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్టీ రిజర్వుడ్ స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలన్నారు. సీట్లు కేటాయింపుల్లో ప్రతిసారి తమకు అన్యాయం జరుగుతున్నదన్నారు. 15న హైదరాబాద్ గాంధీభవన్‌లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు చర్చిస్తామని, ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుండెపోటుతో ఏఎంసీ కార్యదర్శి సాలయ్య మృతి

సాలయ్య(ఫైల్)

తొర్రూరు, ఫిబ్రవరి 12: తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పులిగిల్ల సాలయ్య(59) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వరంగల్‌లోని స్వగృహంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన తొర్రూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా రెండేళ్లు పనిచేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. సాలయ్య మృతికి ఏఎంసీ సిబ్బంది, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, ఫిబ్రవరి 12 : రెండు క్వింటాళ్ల నల్లబెల్లాన్ని సోమవారం డోర్నకల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సంతోశ్‌రావు కథనం ప్రకారం.. మన్నెగూడెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు ఓ ఆటోను తనిఖీ చేయడగా రెండు క్వింటాళ్ల నల్లబెల్లం దొరికింది. నల్లబెల్లం, ఆటో స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చిలుక్కోయలపాడు గ్రామానికి చెందిన ఉప్పలయ్యను అరెస్టు చేయగా, మరో వ్యక్తి వెంకట్రాములు పరారీలో ఉన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOANS

★వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. Cibil అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు, హన్మకొండ. సెల్: 8790379618. NTW-5689

వ్యవసాయ భూమి అమ్మబడును

★12ఎ|| తరి పొలము, 10ఎ|| రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం||, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908 NTW-323212

PLOT FOR SALE

★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908 NTW-323213

CHANGE OF NAME

★I, MALYALA RAJESHWARA RAO (New Name), Previously called MALYALA RAJESHWAR (Old Name), and residing at H.No. 1-12, Issipet Village, Mogullapalle Mandal, Jayashankar Bhupalpally District, T.S. and solemnly declare. NTW-000

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565